క్లుప్తంగా

పెద్దాసుపత్రి అకౌంటెంట్‌గా శ్రీనివాసులు



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆఫీస్ సూపరింటెండెంట్/ఆఫీస్ అకౌంటెంట్-2గా ఆళ్ల శ్రీనివాసులు నియమించడంతో బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1983లో మొదటి సారిగా టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరారు. 2002లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ఆయనను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఏడీ రమేష్‌బాబు, ఏవో శ్రీనివాసులు, కార్యాలయ ఉద్యోగులు అభినందించారు.

డీటీఎఫ్ ఆధ్వర్యంలో 11న ధర్నా



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: విద్యా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 11న విజయవాడలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప తెలిపారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన, ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు మాట్లాడారు. జీఓ ఎం.ఎస్ నంబరు 117ను రద్దు చేయాలని, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్స్‌గా, సీనియర్ గ్రేడ్-2 హెచ్‌ఎంలకు డిప్యూటీ డీఈఓలు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రోషన్న, ముద్దరంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని బలపనూరు-నెరవాడ మెట్ట వద్దలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు బుధవారం తెలిపారు. రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయని చెప్పారు. గాయపడిని వారిని ఆసుపత్రికికి తరలించినట్లు తెలిపారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కురువ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కేక్ కట్ చేస్తున్న జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు లీల

ఓర్వకల్లు : కురువ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను కురువ సంఘం జిల్లా మహిళ సంఘం అధ్యక్షురాలు లీల ఆవిష్కరించారు. స్థానిక కురువ సంఘం కార్యాలయం వద్ద బుధవారం కేక్ కట్ చేసి, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. లీల మాట్లాడుతూ.. కురువలు రాకీయంగా, సామాజికంగా బలోపేతం చెందాలన్నారు. కొత్తగా నియమించే మార్కెట్ యార్డు కమిటీలో కురువలకు డైరెక్టర్ పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడెసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె. రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ధనంజయ, కోశాధికారి కె.సి. నాగన్న, మండల అధ్యక్షులు జీకే అల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు



కల్వర్టుపై ఏర్పడిన చీలిక

ఓర్వకల్లు : కేతవరం ఎస్‌ఆర్‌బీసీ కాల్వ నుంచి స్టీల్‌ప్లాంట్ వెళ్లే రహదారిపై అక్కడక్కడ కల్వర్టు(వంతెన)లు ఏర్పాటు చేశారు. అయితే జాతీయ రహదారి పక్కనే నిర్మిస్తున్న వంతెనపై పగుళ్లు ఏర్పడ్డాయి. పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన వంతెనపై చీలికలు ఏర్పడటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనను తిరిగి నిర్మించకపోతే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంది.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన ఎం.సునీల్‌కుమార్ అనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అతనికి మాచాని సోమనాథ్ బుధవారం మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.30 వేలు చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ.. సునీల్‌కుమార్ ఎంబీబీఎస్ చదవడానికి కష్టాపడుతున్నాడని, తన వంతు సాయం కింద రూ.30 వేలు ఆర్థిక సాయం అందించామన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు.

జోష్‌తో స్వాగతం.. నయా సంతోషం

- అభిమాన నేతలకు శుభాకాంక్షలు
- నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు



ఎస్వీ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



గఫూర్‌కు సీపీఎం నాయకులు సన్మానం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రిన్సిపల్ చీఫ్ జస్టిస్ జి.కబర్ది

కర్నూలు కల్చరల్: కొత్త సంవత్సరానికి నగరవాసులు సరికొత్తగా స్వాగతం పలికారు. 2025 ఏడాదికి గ్రాండ్ వెల్‌కమ్ చెబుతూ వేడుకలు చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి సంబరాలు ప్రారంభించారు. బుధవారమంతా కోలాహలంగా కొనసాగించారు. ప్రముఖుల నివాసాలు, కార్యాలయాలన్నీ కిక్కిరిశాయి. కేక్ కటింగ్‌లతో తియ్యని వేడుకలు జరిగాయి. ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, అలంకరణలతో భక్తి భావం వెల్లివిరిసింది. స్నేహితులు, బంధుమిత్రులు, ఉద్యోగులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలు పుకున్నారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా సంతాప దినాలు ఉండటంతో ఎక్కడా నూతన సంవత్సరానికి సంబంధించిన అధికారిక వేడుకలు జరగలేదు.

ఎస్వీ ఇంట..

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి నివాసంలో నూతన సంవత్సరం 2025 వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో 33 వార్డులకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. ఎస్వీ మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేళ అందరికీ ఆయురారోగ్య, సకల సంతోషాలు కలగాలన్నారు.

కర్నూలు(రూరల్) : వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ మాజీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరిని బుధవారం నగరంలోని వారి స్వగృహంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నెహమ్యి, కర్నూలు మండల మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియాజేశారు. కార్యక్రమంలో ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

సీపీఎం కార్యాలయంలో..

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, జిల్లాకార్యదర్శి బి.గౌస్‌దేశాయ్‌కు పార్టీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారికి పూలమాలలు వేసి అభినందించారు. అలాగే ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్‌యూనియన్ జిల్లాకార్యదర్శి కె.ప్రభాకర్‌కు ఆటోకార్మికులు పూలదండలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ వేర్ హౌస్‌లో కార్మికులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. కేకులు కట్ చేసుకొని తినిపించుకున్నారు.

పేద విద్యార్థులకు ఆహార పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజి వద్ద ఉన్న హోమ్ ఆఫ్ హోప్ అనే సంస్థలోని పేద విద్యార్థులకు ఆహార ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, సభ్యులు రామశంకర్‌నాయక్, డాక్టర్ హేమంతకుమార్, రమణ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(హాస్పిటల్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం వారు జిల్లా ప్రిన్సిపల్ చీఫ్ జస్టిస్ జి. కబర్దితో బుధవారం క్యాలెండర్ ఆవిష్కరింపజేశారు. జస్టిస్ కబర్ది మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ వారు పేదల కోసం చేసే కార్యక్రమాలు మరింత విస్తరింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, మార్కెటింగ్ హెడ్ షేక్ ఖాదర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

కర్నూలు న్యూసిటీ: ప్రజలు తమ సమస్యలను తనదృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. జిల్లా కురువ సంఘం 2025 క్యాలెండర్, వివాహ వేదిక కరపత్రాన్ని బుధవారం బళ్లారి చౌరస్తాలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు గుడిసె శివన్న, రంగస్వామి, పాల సుంకన్న, వెంకటేశ్వర్లు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, రామశంకర్‌నాయక్

పెద్దాసుపత్రిలో ..

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన సంవత్సరం సందర్భంగా హడావుడి కనిపించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లుకు కార్యాలయ ఉద్యోగులు, ఏజెన్సీ నిర్వాహకులు, కాంట్రాక్టర్లు, కార్మికులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణం కారణంగా ఉన్న సంతాపదినాల కారణంగా కేక్‌కట్ చేయడం, పుష్పగుచ్చాలు తీసుకోవడం చేయలేదు. అలాగే కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మను సైతం పలువురు వైద్యులు, ఉద్యోగులు, వైద్య విద్యార్థులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయంలో ఏడీ రమాదేవి, డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు హరిహరతేజ, పర్వీన్‌లను జిల్లాలోని ఫార్మాసిస్టులు, కెమిస్టులు, డ్రగ్గిస్టులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో కార్యాలయ ఉద్యోగులు

వాల్మీకుల ద్రోహి చంద్రబాబు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీఆర్‌పీఎస్, వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో వాల్మీకుల ద్రోహి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వాల్మీకి నేతలు స్థానిక ధర్నా చౌక్ సెంటర్‌లో ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహానికి, ఎస్‌బీఐ సర్కిల్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 36 లక్షల వాల్మీకుల జనాభా ఉన్నా, కూటమి ప్రభుత్వంలో ఇద్దరు టీడీపీ, ఒకరు బీజేపీ శాసనసభ్యులు వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారున్నా, ఒక్కరికీ కూడా మంత్రి పదవి ఇవ్వకపోవడం వాల్మీకుల పట్ల చంద్రబాబుకు ఉన్న ప్రేమ ఏపాటిదో తెలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం టీడీపీ ఎంపీల ఆధారపడిన ఈ పరిస్థితుల్లో వాల్మీకులకు సంబంధించిన ఎస్‌టీ రిజర్వేషన్ హామీ పట్ల చంద్రబాబు శ్రద్ధ చూపడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వాల్మీకులకు ఐదు సంవత్సరాల పాటు మంత్రి వర్గంలో స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని, అలాగే తన ప్రభుత్వంలో వాల్మీకులకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌పీఎస్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోనెగండ్ల మురళీనాయుడు, గాలిరాజు, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్ దస్తగిరి, రవి, శేఖర్, రాముడు, మౌలాలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరు దివ్వెలు పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు : కంబదహాళ్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 61వ పుస్తకం చిరు దివ్వెలు ఆవిష్కరణ హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో బుధవారం ఘనంగా జరిగింది. వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ హైదరాబాద్ వారి 2025 ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం, పుస్తకావిష్కరణ మహోత్సవం కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్, విశ్రాంతి భూగర్భగనుల శాఖ అధికారి డాక్టర్ వీడీ రాజగోపాల్, కళాపోషకులు విశ్రాంతి అటవీశాఖ అధికారి ఏఎల్ కృష్ణారెడ్డి, కళారత్న డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు. ప్రముఖుల చేతుల మీదుగా పుస్తకావిష్కరణ అయ్యింది.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డికి నోటు పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

కల్లూరు: నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖంగా, సంతోషంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన తనయుడు కాటసాని శివనరసింహారెడ్డితో కలసి స్వగృహంలో కేక్ కట్ చేశారు. అనంతరం అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాలో పదవులు పొందిన నాయకులు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక పూజలు.. ప్రార్థనలు

- కిటకిటలాడిన మసీదులు, చర్చిలు, ఆలయాలు



కర్నూలు నగరంలో సూర్యదేవునికి పూజలు చేస్తున్న భక్తులు



పెద్దటేకూరు చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

కర్నూలు న్యూసిటీ: నూతన సంవత్సర వేడుకలను నగర ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సంవత్సరమంతా మేలు జరగాలని అన్ని వర్గాల ప్రజలు బుధవారం ఆలయాల్లో పూజలు చేశారు. మసీదులు, చర్చిలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల రాక, ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. గుత్తి పెట్రోల్ బంకు కూడలి సమీపంలోని సూర్య దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఇక్కడ ప్రత్యేక పూజలు, అభిషేకాలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

కల్లూరు: నూతన సంవత్సరం సందర్భంగా కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఒక్కరికి ఒక్కరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే వివిధ ప్రాంతాల్లోని చర్చిల వద్ద ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు

కర్నూలు (టౌన్): కర్నూలు క్లబ్‌లో డిసెంబర్ 29న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించగా రవీంద్ర గ్లోబల్ స్కూల్ విద్యార్థులు 3 బంగారు, 12 సిల్వర్, 6 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను రవీంద్ర విద్యా సంస్థల వైస్ చైర్మన్ వంశీధర్ సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించారు. ప్రిన్సిపాల్ ముంతాజ్, తైక్వాండో మాస్టర్ అజయ్ పాల్గొన్నారు.

రేపు రేపల్లె వేడుకలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు రేపల్లె వేడుకలు నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గోదమ్మ సారె మహోత్సవం, తిరుప్పావై పారాయణం, కోలాటం, భజనలు ఉంటాయని తెలిపారు.

బైక్‌కు నిప్పు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని తమ్మనిగేని వీదిలో నివాసం ఉంటున్న టి.నరసింహులు అనే వ్యక్తికి చెందిన బజాజ్ స్టార్ సిటీ బైక్ (ఏపీ21 సీసీ6052)కు బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు న్యూఇయర్ వేడుకల్లో రాత్రి 2 గంటల వరకు ఉండి ఇంటికి వెళ్లాడు. ఇంటికి వెళ్లాలంటే మెట్ల మార్గం ఉండడంతో బైక్‌ను కాళికదేవి ఆలయం సమీపంలో వదిలేసి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున 4గంటలకు గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు స్థానికులు సమాచారం అందించారు. బైక్ పూర్తిగా కాలిపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విభూతి ధారణతో మల్లన్న దర్శనం

నుదుట బొట్టు పెట్టుకోవడం సనాతన సంప్రదాయం. ఎంతో విశిష్టమైన మన అర్ష సంస్కృతికి ఇది ప్రతీక. బొట్టు పెట్టుకున్న ముఖంలో మంగళకరమైన కళ తాండవిస్తుంది. విభూతి ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. సర్వతీర్థాలలో స్నానం చేస్తే ఎంత ఫలమో, సర్వక్షేత్రాలను దర్శిస్తే ఎంత ఫలమో.. అంత ఫలము ఒక్క భస్మధారణతో లభిస్తుంది. అందుకే శ్రీశైల దేవస్థానం విభూతిధారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆలయంలోకి ప్రవేశించే ప్రతి భక్తుడూ విభూతి ధారణ చేసేలా ఏర్పాట్లు చేసింది. – శ్రీశైలంటెంపుల్



విభూతిధారణ చేస్తున్న దృశ్యం

- ఆలయంలోకి ప్రవేశించే భక్తులకు విభూతిధారణ
- పలు చోట్ల ఏర్పాటు.. పరవశిస్తున్న భక్తులు

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి విచ్చేసే భక్తులు తప్పనిసరిగా విభూతి ధారణ చేయాలనే ఉద్దేశంతో 2019 సెప్టెంబర్ 13న విభూతిధారణను ప్రవేశపెట్టింది. ఆలయంలోకి ప్రవేశించే వారంతా నుదుట విభూతి ధరించే వీలుగా పలుచోట్ల ఆయా ఏర్పాట్లు చేశారు. ఆలయ క్యూకాంప్లెక్స్, ఆలయ రాజగోపురం, ఉచిత దర్శన క్యూలైన్, శీఘ్రదర్శన క్యూలైన్ వద్ద విభూతి ధరించేందుకు వీలు కల్పించారు. దేవస్థానం ప్రవేశపెట్టిన విభూతిధారణకు భక్తులు ఎంతో పరవశించిపోతున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్లే ముందు నుదుటిపై విభూతిధారణ చేస్తారు. దీంతో ఎంతో ఆధ్యాత్మిక చింతన పొందుతూ ఆలయంలో ఉన్నంతసేపు ఆధ్యాత్మిక అంశాలతో స్వామిఅమ్మవార్లను దర్శించి తరిస్తున్నారు.

– శిరస్సుపై విభూతి ధరిస్తే స్వయంగా బ్రహ్మ ప్రీతి చెందుతాడు. నుదుటిపై విభూతి ధరిస్తే స్కంధుడు ప్రీతి చెందుతాడు. కతంపై విభూతి ధరిస్తే వినాయకుడు, భుజాలపై విభూతి ధరిస్తే విష్ణువు, హృదయంపై విభూతి ధరిస్తే ఈశ్వరుడు, నాభిపై విభూతి ధరిస్తే భూదేవి, వీపుపై విభూతి ధరిస్తే పితరులు అలా ఆయా చోట్ల విభూతి ధరిస్తే ఆయా దేవతలు అనుగ్రహిస్తారు.

విభూతి ఓంకార స్వరూపం

విభూతిని ఎడమచేతిలో ఉంచుకుని కుడిచేతితో అభిమంత్రించాలి. కుడిచేతి మధ్యవేలితో నీటిని పోసి మిగిలిన వేళ్లతో భస్మాన్ని కలపాలి. అస్త్రమంత్రంతో అభిమంత్రించి, తల, నదుట, హృదయం మొదలైన చోట్ల క్రమంగా భస్మాన్ని ధరించాలి. విభూతి ధరించే మూడు వేళ్లను మూడు అక్షరాలకు ప్రతినిధులు. ఉంగరపు వేలు అకారం, మధ్యవేలిలో ఉకారం, చూపుడు వేలులో మకారం ఉంటాయి. ఈ మూడు వేళ్లతో ధరించే విభూతి ఓంకార స్వరూపమని స్కాందపురాణం తెలిపింది.

విభూతి రేఖలు ఆదిదేవతలు

విభూతిని మనం మూడు రేఖలుగా అవి విడివిడిగా కనిపించేలా ధరించాలి. విభూతి రేఖలు మూడింటిలో కిందిరేఖకు బ్రహ్మ, మధ్యరేఖకు విష్ణువు, పై రేఖకు మహేశ్వరుడు ఆదిదేవతలు. ఈ మూడు రేఖలు సృష్టి, స్థితి, సంహారాలకు ప్రతిరూపాలు. ఈ మూడు రేఖలకు మధ్యలోని రెండు ఖాళీ ప్రదేశాలలో ఒకదానికి షణ్ముఖుడు, రెండవ దానికి గణపతి ఆదిదేవతలు. ఇంతటి విశిష్టమైన విభూతిని ధరించి శివానుగ్రహం పొందాలని భక్తులు పరితపిస్తుంటారు.

సమాజ చైతన్య సాధనాలు నాటకాలు

- ఘనంగా ప్రారంభమైన సాంఘిక నాటకోత్సవాలు



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్



మూల్యం నాటికలో అలరించిన సన్నివేశం

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్య సాధనాలు నాటకాలని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ అన్నారు. హైదరాబాద్ మహతి క్రియేషన్స్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు జరిగే సాంఘిక నాటకోత్సవాలు బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సాంఘిక నాటకాలు ప్రస్తుతం సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను చూపిస్తాయన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సినీ నటులు సుబ్బరాయ శర్మ, గోపరాజు రమణ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడారు. అనంతరం కళా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి సన్మానంలో భాగంగా మొదటి రోజు నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి మూల్యం, గుంటూరు కొలకలూరు సాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీల నాటికల ప్రదర్శన అలరించింది. ఆలోచింపచేలా కథా ఇతివృత్తాలు, కళాకారుల నటన ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు ఇనాయతుల్లా, ఈశ్వరయ్య, యాగంటీశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి ఆదరణ అవసరం



సినీ నటుడు సుబ్బరాయ శర్మ

కర్నూలు కల్చరల్: నాటక రంగాన్ని ఆదరించాల్సిన అవసరం ఉందని ప్రముఖ నాటికలు, సినీ, టీవీ నటుడు యు.సుబ్బరాయ శర్మ అన్నారు. హైదరాబాద్ మహతి క్రియేషన్స్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో కర్నూలులో 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్న సాంఘిక నాటకోత్సవాల్లో పాల్గొనడానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నంది నాటక ఉత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తే కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తాను కర్నూలు ఆర్టీసీలో 1978లో ఉద్యోగం చేశానని, 1997లో వీఆర్‌ఎస్ ఇచ్చి పూర్తి స్థాయిలో నటన రంగం వైపు వచ్చానని తెలిపారు. మహతి క్రియేషన్స్‌తో ప్రతీ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక చోట నాటక ఉత్సవాలు నిర్వహించేవారమని, ఈ ఏడాది కర్నూలులో నిర్వహిస్తున్నామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షు లు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. కర్నూలు అంటేనే పౌరాణిక నాటకాలు గుర్తుకు వస్తాయన్నారు.

శ్రీమఠంలో కన్నడ సినీ నటుడు జగ్గేష్



పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న నటుడు జగ్గేష్

మంత్రాలయం: నూతన సంవత్సరం సందర్భంగా కన్నడ సినీ నటుడు జగ్గేష్, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ వేర్వేరుగా మంత్రాలయం వచ్చారు. బుధవారం శ్రీమఠానికి చేరుకుని ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. వారిని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఫల, పూల మంత్రాంక్షితలు, రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు. నటుడు జగ్గేష్‌తో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆసక్తి చూపారు.